సాక్షి నిజామాబాద్

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



డిగ్రీ ఫలితాలు విడుదల

తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను రిజిస్ట్రార్ యాదగిరి విడుదల చేశారు.

- 8లో ▸



అమ్మేసుకుంటున్నారు..

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న గొర్రెలను లబ్ధిదారులు అమ్మేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.7 /24.7

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీలోకి పెరిగిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెరిగింది. ప్రాజెక్ట్‌లోకి 4590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్టు ద్వారా 360 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 152 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1090.60 (88.11 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో అధికారుల భేటీ



సుభాష్‌నగర్: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథితో జిల్లా ఉన్నతాధికారులు బుధవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో భేటీ అయ్యారు. నిర్మల్ జిల్లా బాసరలో గల ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు ప్రేరణ కల్పించే కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుండగా, జిల్లాకేంద్రంలోని అతిథి గృహంలో ఆయన బస చేశారు. ఆయనకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, అదనపు డీసీపీ జయరాం, జెడ్పీ సీఈవో గోవింద్, డీఎస్‌వో చంద్రప్రకాశ్ స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ పార్థసారథితో భేటీ అయ్యారు. పలు అంశాలపై జిల్లా అధికారులతో ఆయన చర్చించారు.

ముగిసిన సైన్స్ కాంగ్రెస్



మోపాల్: నగర శివారులోని బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ బుధవారం ముగిసింది. 'ఆరోగ్యం, సంక్షేమం కోసం అర్థం చేసుకొనడం' అనే ప్రధాన అంశంగా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు స్థానికంగా ఉన్న సమస్యలకు పరిష్కారాలు రూపొందించి ప్రదర్శనలు ఇచ్చారు. ప్రతిభ కనబర్చిన మూడు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రజా సైన్స్ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు కనుక్కోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు, గైడ్ టీచర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీలకు జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ బి శ్రీనివాస్, కరుణ శ్రీ, గోవర్ధన్ జూరీలుగా వ్యవహరించారు. జిల్లా సైన్స్ అధికారి గంగకిషన్, పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ శంకర్ పాల్గొన్నారు.

వాహనాలకు బహిరంగ వేలం

ఖలీల్‌వాడి: కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఉన్న 226 వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించగా రూ.19.30 లక్షలు వచ్చినట్లు సీపీ సత్యనారాయణ తెలిపారు. నగరంలోని ఎల్లమ్మగుట్టలో ఉన్న పోలీస్ లైన్‌లో బుధవారం వేలం నిర్వహించారు. ఈ వేలాన్ని మూసా అండ్ కంపెనీ టీం హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. హైదరాబాద్, గుంటూరు, కాకినాడ, నిర్మల్, నిజామాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలంలో పాల్గొనేందుకు వచ్చారు. అదనపు డీసీపీలు జయ్‌రామ్, గిరిరాజు, ఏసీపీలు కిరణ్ కుమార్, నారాయణ పాల్గొన్నారు.

ఇదొక్కటే అవకాశం

- ఈ ఎన్నికల తరువాత అవకాశాలు వస్తాయో లేదో?
- కల నెరవేర్చుకునేందుకు నేతల తాపత్రయం
- మహిళా రిజర్వేషన్ నేపథ్యంలో మారిన నాయకుల ఆలోచనలు

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు 2027 నుంచి అమలులోకి రానున్న నేపథ్యంలో.. ఈసారి ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ఆశావహులు గట్టి ప్రణాళికలను రచించుకుంటున్నారు. కాగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మహిళల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి.దీంతో భవిష్యత్తులో కుటుంబంలోని మహిళలనూ క్షేత్రస్థాయి రాజకీయాల్లోకి తీసుకురావాలనే తలంపు చేస్తున్నారు.



నిజామాబాద్ జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాల పట్టిక..

నియోజక వర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్ ఎలక్ట్రోల్	మొత్తం
ఆర్మూర్	94,407	1,07,440	6	124	2,01,977
బోధన్	99,782	1,08,139	5	167	2,08,093
నిజామాబాద్ అర్బన్	1,32,933	1,41,408	31	70	2,74,442
నిజామాబాద్ రూరల్	1,12,518	1,28,529	4	181	2,41,232
బాల్కొండ	96,244	1,12,172	3	62	2,08,481

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టంగా రూపుదాల్చనుంది. ఈ నేపథ్యంలో వివిధ పార్టీల నుంచి చట్టసభలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్న నాయకులు ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ధృడ సంకల్పంతో ఉన్నారు. అనేకసార్లు టిక్కెట్ల కోసం ప్రయత్నాలు చేసి విఫలమవుతున్నవారు, పోటీ చేసి ఓటమి పాలవుతున్నవారు, కొత్తగా బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నవారు, ఇదే చివరి అవకాశం అనుకునే వయస్సు పైబడుతున్నవారు, ఈసారి గెలిస్తే మంత్రి పదవి దక్కించుకోవాలనుకుంటున్న ఎమ్మెల్యేలు సైతం ఇదొక్కటే అవకాశం అనుకుంటూ బరిలోకి దిగాలి.. సర్వశక్తులు ఒడ్డి గెలుపొందాలనే లక్ష్యంతో ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడంతో ఒక రాత్రంతా జిల్లాకు చెందిన పలువురు నేతలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఏ ఏ నియోజకవర్గాల్లో మహిళల ఓట్లు ఎక్కువగా ఉన్నాయనే విషయమై లెక్కలు, విశ్లేషణలు చేసుకుంటూ గడిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మహిళల ఓట్లే ఎక్కువగా ఉండడంతో నాయకులు బేజారెత్తిపోయారు. అయితే తెల్లారేవరకు ఊరటనిచ్చే వార్త తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు 2027 నుంచి అమలులోకి వస్తాయని కేంద్రం ప్రకటించడంతో ఊరట చెందారు. ఈ నేపథ్యంలో ఎలాగైనా ఈసారి తమ కలను నెరవేర్చుకోవాలని కృతనిశ్చయంతో కార్యాచరణకు సిద్ధమవుతున్నారు.

● జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గాల్లో మహిళల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లా నిజామాబాద్(9), ఉమ్మడి ఖమ్మం(10) జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. దీంతో నిజామాబాద్ జిల్లాలో వివిధ పార్టీల నాయకులు తాజా పరిస్థితి, భవిష్యత్ గురించి లెక్కలు వేసుకుంటున్నారు. ఏఏ నియోజకవర్గాలు మహిళలకు రిజర్వు అవుతాయో అనే అంచనాలతో పరేషాన్ అవుతున్నారు. దీంతో తమ భార్యలను, కుమార్తెలను, కోడళ్లను సైతం క్షేత్రస్థాయి రాజకీయాల్లోకి తీసుకురావాలనే తలంపు సైతం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ సారికి మాత్రం అవకాశం ఉండడంతో సర్వశక్తులూ ఒడ్డేందుకు సిద్ధమయ్యారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి బీజేపీ టిక్కెట్టు ఆశిస్తున్న ధన్‌పాల్ సూర్యనారాయణ, కాంగ్రెస్ నుంచి టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్న మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, కాంగ్రెస్ గెలిస్తే కచ్చితంగా కేబినెట్ బెర్త్ దక్కుతుందంటున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నిజామాబాద్ రూరల్ నుంచి ఈసారి గెలిస్తే కచ్చితంగా మంత్రి పదవి వస్తుందంటున్న సిట్టింగ్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మూడేళ్ల ఎమ్మెల్సీ పదవి వదలుకుని గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగి ఓటమి చెందిన డాక్టర్ భూపతిరెడ్డి ఈసారి టిక్కెట్టు తెచ్చుకుని గెలవాలనే పట్టుదలతో ఉన్నారు. బాల్కొండ నుంచి డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ముత్యాల సునీల్ రెడ్డి, బీజేపీ నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి బరిలోకి దిగి గెలవాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. బోధన్ నుంచి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఇదే చివరి అవకాశం అంటూ బరిలోకి దిగుతున్నారు. ఆర్మూర్ నుంచి పొద్దుటూరి వినయ్ రెడ్డి, గోర్త రాజేందర్ కాంగ్రెస్ టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. వీరంతా విజయం సాధించి తమ కలను నెరవేర్చుకోవాలనే నిశ్చయంతో ఉన్నారు.

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



కలెక్టరేట్ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

- గేట్లు ఎక్కి లోనికి చొచ్చుకెళ్లేందుకు అంగన్‌వాడీల యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- తోపులాటలో పలువురికి గాయాలు

సుభాష్‌నగర్: తమ డిమాండ్లు పరిష్కరించాలని బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. జిల్లా నలుమూలల నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అంతకు ముందు బైపాస్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, ప్రదర్శనతో కలెక్టరేట్‌ను ముట్టడించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో కలెక్టరేట్ ప్రాంగణం దద్దరిల్లింది. కలెక్టర్ బయటకు రావాలని డిమాండ్ చేశారు. ఆయన రాకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు గేట్లు ఎక్కి లోనికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు ఎక్కడికక్కడ కట్టడి చేసి అదుపు చేశారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకోగా పలువురికి గాయాలయ్యాయి. అంగన్‌వాడీల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం ఏసీపీ జోక్యం చేసుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ ప్రతినిధులను అదనపు కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి పరిస్థితిని చక్కదిద్దారు. అదనపు కలెక్టర్‌కు అంగన్‌వాడీ సిబ్బంది వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నూర్జహాన్, శంకర్ గౌడ్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ 10 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా.. రెచ్చగొట్టే విధంగా సెంటర్ల తాళాలు పగులగొట్టి తెరవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. సమ్మెలో ఉన్న కార్యకర్తలను బెదిరించడం సరికాదన్నారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్‌చేశారు. మల్యాల గోవర్ధన్, ద్యారంగుల కృష్ణ, ఏశాల గంగాధర్, దేవ గంగు, స్వర్ణ, చంద్రకళ, మంగాదేవి, శివరాజమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా కాంగ్రెస్

అంగన్‌వాడీల డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవని, వారికి న్యాయం జరిగే వరకూ కాంగ్రెస్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఆయన అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతు తెలిపి మాట్లాడారు. టీచర్ల జీతాలు రూ.26వేలకు పెంచాలని, 60 ఏళ్లకు రిటైర్మెంట్ వయస్సు పెంచాలని డిమాండ్‌చేశారు. వారికి న్యాయం జరిగే వరకూ కాంగ్రెస్ తరఫున పోరాడుతామన్నారు.



గేట్‌పైకి ఎక్కుతున్న సీఐటీయూ నాయకురాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

హామీల అమలు ఘనత కేసీఆర్‌దే..



పడగల్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపిన ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానిదేనని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన వేల్పూర్ మండలం పడగల్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలో పేదవారికి ప్రాధాన్యత తప్ప, పైరవీలకు ఏమాత్రం అవకాశం ఉండదన్నారు. డబుల్ బెడ్‌రూం పథకంలో పారదర్శకంగా లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారన్నారు. ఇక్కడి ఇళ్ల నిర్మాణానికి రూ.6.29 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. ఇదే ప్రాంగణంలో అందుబాటులో ఉన్న స్థలంలో మరో 32 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. సొంత స్థలం కలిగిన 62 మందికి గృహలక్ష్మి పథకం కింద రూ.మూడు లక్షల చొప్పున మంజూరు చేస్తామన్నారు. కళ్ల ముందున్న అభివృద్ధిని చూడాలని, మాయా మాటలతో మభ్యపెట్టే వారి వల్ల ఆగం కావద్దన్నారు. కాంగ్రెస్ పాలనలో కర్ఫ్యూలు, కరెంటు కోతలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కె రమేశ్‌రెడ్డి, ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ రాజేశ్వర్‌రెడ్డి, వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ అరుణ, ఎంపీపీ బీమ జమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి, సర్పంచ్ వర్షిణి రాజ్‌కుమార్, సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్యాంరావు, ఆమోస్ పాల్గొన్నారు.

చంద్రబాబు అవినీతి చేసి జైలుకెళ్లాడు



మాట్లాడుతున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

- ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్

నిజామాబాద్ నాగారం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత అవినీతి పరుడు కాబట్టే జైలుకు వెళ్లాడని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. బుధవారం నిజామాబాద్ నగరంలోని బైపాస్ రోడ్‌లో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉండి రూ.వేల కోట్లు చంద్రబాబు దోచుకున్నారన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన విషయం తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు. రూ.లక్షల కోట్లు మెక్కడంతోనే ఊచలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో కుటుంబ పాలన నడుస్తుందని, అంతే అవినీతి జరుగుతుందన్నారు. తెలంగాణ జరిగే ఎన్నికలను ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, బీజేపీ బీ టీం అని, అందుకే కవితను అరెస్టు చేయడం లేదన్నారు. తనను ముఖ్యమంత్రి చేస్తే అవినీతి లేని పాలనతో అభివృద్ధి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో ప్రజాశాంతి పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్, కాంగ్రెస్ కుటుంబ పాలన చేస్తున్నాయని, నరేంద్ర మోదీ తన మిత్రులకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. తన పార్టీలోకి ఎంపీ అర్వింద్, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, మాజీ ఎంపీ మధుయాష్కి రావాలని పాల్ కోరారు. తాను సీఎం అయితే విద్య, వైద్యం ఉచితంగా అందిస్తానన్నారు.

గన్‌లు వాపస్ తీసుకుంటాం

- సీపీ సత్యనారాయణ




మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: లైసెన్స్ కలిగిన వారి నుంచి వారం రోజుల్లో గన్‌లను తీసుకుంటామని సీపీ సత్యనారాయణ తెలిపారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016 నుంచి ఇప్పటి వరకు 33 గన్ లైసెన్స్‌లు ఇచ్చామన్నారు. ఇందులో మూడు లైసెన్స్‌లు వెనక్కి తీసుకున్నట్లు చెప్పారు. రౌడీ షీట్ ఉంటే గన్ లైసెన్స్ పొందేందుకు అర్హత లేదన్నారు. అలాంటి వారికి గన్‌లైసెన్స్‌లు ఉంటే వాటిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కంట్రీ మేడ్ తుపాకులు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు గన్‌తోపాటు లైసెన్స్‌లను తీసుకుంటామని చెప్పారు. కమిషనరేట్ పరిధిలో గన్ లైసెన్స్‌లు 23 బ్యాంక్‌కు సంబంధించిన వారివి, 52 బయట వ్యక్తులవి ఉన్నట్లు చెప్పారు. ఇందులో రెండు వేరే ప్రాంతానికి చెందిన వారివన్నారు. గన్ లైసెన్స్‌లపై అపోహలను నమ్మవద్దన్నారు.

ప్రజాభద్రతకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించం

ప్రజాభద్రతకు ఆటంకం కలిగిస్తే ఉక్కుపాదం మోపుతామని రౌడీ షటీర్లను సీపీ సత్యనారాయణ హెచ్చరించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లాలోని రౌడీ షీటర్లకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగ, రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రౌడీ షీటర్లతో సీపీ మాట్లాడారు. ప్రజల మనోభావాలకు దెబ్బతీసేవారు ఎవరైనా ఉపేక్షించబోమని, వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రౌడీ షీటర్లపై నిఘా ఉంచుతామన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. రౌడీ షీటర్లు వేరే ప్రాంతాలకు వెళ్తే సంబంధించిన పోలీస్ స్టేషన్‌లలో సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీలు జయ్‌రామ్, గిరిరాజు, ఏసీపీలు కిరణ్‌కుమార్, జగదీష్‌చందర్, కిరణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం పాల్గొన్నారు.

60 అడుగుల మట్టి గణపతి



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోచమ్మగల్లిలో 60 అడుగుల భారీ మట్టి గణనాథున్ని యువకులు ప్రతిష్ఠించారు. కోల్‌కతా నుంచి వచ్చిన కళాకారులు 28 రోజుల్లో ఈ మట్టి విగ్రహాన్ని రూపొందించారు. విగ్రహ తయారీలో మట్టి , వెదురు కర్రలు సహజసిద్ధమైన రంగులు వాడారు. రూ.6 లక్షల వరకు వ్యయం అయిందని మండలి నిర్వాహకులు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద మట్టి గణనాథుడి విగ్రహమని వారు తెలిపారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

'గృహలక్ష్మి'ని వేగవంతం చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

సుభాష్‌నగర్: గృహలక్ష్మి పథకం దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హుల జాబితాను పంపించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. వివిధ వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారికి సకాలంలో లబ్ధి చేకూరేలా కృషి చేయాలన్నారు. రుణమాఫీ, ఆసరా పెన్షన్లు, ఎరువులు–విత్తనాల నిల్వలు, తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి, నివేశన స్థలాల అందజేత తదితర అంశాలపై బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సీఎస్ సమీక్షించారు. గృహలక్ష్మి పథకం కింద అర్హులను గుర్తించి, సత్వరమే మంజూరు పత్రాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. రెండు వారాల్లో ఆయా జిల్లాలకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా పూర్తిస్థాయిలో మంజూరు ఇవ్వాలని గడువు విధించారు. ఈ విషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ జిల్లాలో గృహలక్ష్మి పథకం కింద 16,500 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని లక్ష్యం కాగా, 3,930 మంది జాబితా సిద్ధమైందని సీఎస్ దృష్టికి తెచ్చారు. గురువారం నుంచి మంజూరు పత్రాలు పంపిణీ చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నామని, వారం రోజుల్లో జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. పంట రుణాల మాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసేలా చూడాలని, బ్యాంకర్లతో ప్రతీ వారం క్రమం తప్పకుండా సమీక్షించాలని మార్గనిర్దేశం చేశారు. జీవో 58, 59 కింద భూముల క్రమబద్ధీకరణను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, డీఎఫ్‌వో వికాస్ మీనా, కమిషనర్ ఎం మకరంద్, డీఆర్‌డీవో చందర్, డీపీవో జయసుధ, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ రావు, డీఏవో వాజిద్ హుస్సేన్, ఇంజినీరింగ్ అధికారులు భావన, శంకర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి నిజామాబాద్ జిల్లాను బుధవారం సందర్శించారు. నగరంలోని ఆర్‌అండ్ బీ గెస్ట్ హౌస్‌లో ఆయనను రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బీసీ ఉద్యోగుల సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా రాజీలేని పోరాటం కొనసాగించాలని ఆయన సూచించారు. ఎన్నికల కమిషనర్‌ను కలిసిన వారిలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్, జాయింట్ సెక్రటరీ భాస్కర్ ఉన్నారు.

అధ్యాపకులు సమయపాలన పాటించాలి



తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులకు అందుబాటులో ఉంటూ అధ్యాపకులు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని, సమయపాలన పాటించాలని తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి సూచించారు. బుధవారం టీయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో పలు విభాగాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా విభాగాల్లో బోధనా తీరును పరిశీలించారు. మాస్ కమ్యూనికేషన్ కంప్యూటర్ ల్యాబ్‌ను, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ ల్యాబ్‌లను, బోటనీ, బయోటెక్నాలజీ ల్యాబ్‌లను తనిఖీ చేశారు. ప్రతి ల్యాబ్‌లో ఉన్న పరికరాలు, కెమికల్స్ విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా చూడాలని సూచించారు. రిజిస్ట్రార్ వెంట వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు నాగరాజు, బాలకిషన్, జవేరియా ఉజ్మా, కిరణ్మయి, పీఆర్వో పున్నయ్య, కేర్ టేకర్ సుధీర్, సిబ్బంది ఉన్నారు.

దీన్ దయాళ్ స్పర్శ్ పరీక్షలు వాయిదా

నిజామాబాద్ సిటీ: తపాలా శాఖలో ఫిలాటలీ ఖాతా ఉన్న విద్యార్థులకు ఈ నెల 24న నిర్వహించనున్న దీన్ దయాళ్ స్పర్శ్ పరీక్షను అక్టోబర్ 1న వాయిదా వేసినట్లు తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెలా 22 వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు విషయాన్ని గమనించాలని కోరారు.

బోధన్‌లో నాలుగు దుకాణాలు సీజ్



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పాత బస్టాండ్‌లో ఉన్న ఫ్రూట్ మార్కెట్ దుకాణ సముదాయాల్లో నాలుగు దుకాణాలను మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ సీజ్ చేశారు. ఫ్రూట్ దుకాణాలకు కేటాయించిన దుకాణాలను లబ్ధిదారులు సబ్ లీజ్‌కు ఇచ్చి వేరే దుకాణాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియలో పాల్గొని దుకాణాలను పొందిన లబ్ధిదారులు మాత్రమే దుకాణాలు నిర్వహించాలన్నారు. ఇతరులకు సబ్ లీజ్‌కు ఇవ్వరాదవని, కేవలం పండ్ల దుకాణాలు మాత్రమే ఏర్పాటు చేయాలని సూచించారు. బల్దియా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సెల్ఫీ విత్ గణేశ్

సాక్షి ఆహ్వానానికి స్పందన



ఉమ్మెదలో మట్టి గణనాథుడితో యువకులు

నిజామాబాద్ నాగారాం: జిల్లాలోని అన్ని గ్రామాల్లో వినాయక చవిత ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకొంటున్నారు. మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు పలు చోట్ల కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేపట్టారు. పలువురు గణేశ్‌విగ్రహాలతో దిగిన సెల్ఫీలను 'సాక్షి'తో పంచుకున్నారు.



ప్రగతినగర్‌లో పూజ చేస్తున్న చిన్నారులు



విఘ్నేశ్‌గౌడ్, వినాయక్‌నగర్



డొంకేశ్వర్: గాదేపల్లిలో గణనాథుడితో ..



వేల్పూర్: మోతెలో పోల విజయలక్ష్మి



నగరంలో మట్టిగణపతితో బాలుడు

నేరాల నియంత్రణకు కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్ కుమార్

వర్ని: నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో ఏసీపీతో పాటు సీఐలు, ఎస్సైలు బుధవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వాహనాలను తనిఖీ చేసి ధ్రువపత్రాలను పరిశీలించారు. ధ్రువపత్రాలు లేని 56 వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజల్లో భద్రతా భావం కల్పించేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో రుద్రూర్ సీఐ జేఎస్ రెడ్డి, బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, ఎస్సై కృష్ణకుమార్, నరేశ్, సందీప్, విక్రం, పీటర్ ఉన్నారు.

ఎమ్మెల్సీ పోరాట ఫలితమే మహిళా బిల్లు



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాట ఫలితమే పార్లమెంట్‌లో 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదమైందని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, ధర్పల్లి, జక్రాన్‌పల్లి జడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, తనూజాశ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన ఆర్టీసీ చైర్మన్



సుభాష్‌నగర్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు రావాలని ఆహ్వానించారు. నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి ఉన్నారు.

అమ్మకానికి పసికందు

- రూ. 45 వేలకు విక్రయించేందుకు యత్నం
- ఐదుగురిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: దత్తత పేరుతో మూడు నెలల పసికందును విక్రయించేందుకు యత్నించిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి మూడు నెలల పసికందును రూ.45 వేలకు విక్రయించేందుకు తల్లిదండ్రులు సిద్ధపడగా పోలీసులు అడ్డుకున్నారు. నవీపేట్ మండలం అభంగపట్నంకు చెందిన దర్శనం సంధ్య, గంగాధర్ మధ్యవర్తి లక్ష్మణ్ ద్వారా కొనుగోలు చేసేందుకు జగిత్యాల్ మండలం చర్లపల్లికి చెందిన చర్ల స్వప్న, గంగారాం దంపతులు ముందుకు వచ్చారు. పక్కా సమాచారంతో సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా వారిని పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. చిన్నారి తల్లిదండ్రులతోపాటు కొనుగోలుకు వచ్చిన దంపతులు, దళారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

లారీని ఢీకొన్న బస్సు

- 8 మందికి స్వల్ప గాయాలు



ఘటన స్థలిలో ధ్వంసమైన బస్సు

కామారెడ్డి క్రైం: రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని రాజధాని బస్సు ఢీకొన్న ఘటన కామారెడ్డి సమీపంలోని టేక్రియాల్ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ నుంచి 40 మంది ప్రయాణికులతో రాజధాని బస్సు హైదరాబాద్ వెళ్తోంది. టేక్రియాల్ సమీపంలో ఎదురుగా వెళ్తున్న కంటెయినర్‌ను ఓవర్‌టెక్ చేయబోయి రోడ్డుపక్కన నిలిపి ఉంచిన లారీని ఢీకొన్నది. ఈ ఘటనలో 8 మందికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. పెను ప్రమాదం తప్పింది.

కామాంధ అధ్యాపకుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: విద్యాబుద్ధులు చెప్పాల్సిన గురువు కామాంధుడి వేషం ధరించడంతో అభం శుభం తెలియని ఓ విద్యార్థినిని గర్భం దాల్చింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి చివరికి మోసం చేయడంతో కటకటాలపాలయ్యాడు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని గంగాస్థాన్‌లో నిర్వహిస్తున్న ఓ ఎంసెట్ కోచింగ్ సెంటర్‌లో 2019లో జాయిన్ అయింది. అందులో లెక్చరర్‌గా పనిచేస్తున్న సైదులు కోచింగ్‌కు వచ్చే విద్యార్థినిపై కన్నేశాడు. ఆమెను క్రమంగా లోబర్చుకునే ప్రయత్నం చేశాడు. ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పి మోసం చేశాడు. దీంతో సదరు విద్యార్థిని గర్భం దాల్చింది. ఈ విషయమై లెక్చరర్‌ను నిలదీయగా పెళ్లి చేసుకుంటానని నాటి నుంచి దాటవేస్తూ వస్తున్నాడు. చివరికి పెళ్లిచేసుకోనని చెప్పడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు సైదులుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద గ్రామానికి చెందిన నీరుడి దుర్గవ్వ(35) కుటుంబ కలహాలతో ఈ నెల 18న పురుగులమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. దుర్గవ్వకు వరంగల్‌కు చెందిన అజ్మల్‌పాషను ఇల్లరికం తీసుకొచ్చి పెళ్లి చేశారు. వీరికి ఒక కూతురు, ఇద్దరు కుమారులు. 2019లో దుర్గవ్వ గర్భిణీగా ఉన్నప్పుడు అజ్మల్‌పాష భార్యతో గొడవపడి పిల్లలను తీసుకొని వెళ్లిపోయాడు. 2020లో మరో బాబుకు జన్మనిచ్చిన దుర్గవ్వ తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. ఈ నెల 18న ఇంట్లో జరిగిన గొడవతో మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు మెదక్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకు 19న హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

భర్తపై హత్యాయత్నం

కమ్మర్‌పల్లి: ఓ మహిళ తన భర్తపై హత్యాయత్నం చేసి ప్రమాదంగా చిత్రీకరించి పోలీసులకు దొరికిపోయిన ఘటన కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనాపూర్‌కు చెందిన వేముల రాజు తన భార్య సుజాతను నిత్యం మద్యం సేవించేందుకు డబ్బులు కావాలని కొడుతూ వేధించేవాడు. బాధ భరించలేక సుజాత ఈ నెల 11న ఇంట్లో నిద్రిస్తున్న రాజుపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టింది. ఈ ఘటనను ప్రమాదంగా చిత్రీకరించడానికి ప్రయత్నించింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజు పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలను సేకరించారు. అనుమానంతో సుజాతను విచారించగా భర్తను హత్య చేయడానికి ప్రయత్నించినట్లు తేలింది. తన భర్త నిత్యం తాగడానికి డబ్బుల కోసం వేధిస్తున్నాడని కోపంతో ఈ ఘటన చేసినట్లు అంగీకరించింది. కేసు నమోదు చేసి నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహం లభ్యం

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన గంగాధర్(45) మృతదేహం దేవాడ వాగులో లభ్యమైనట్లు ఎస్సై మురళి బుధవారం తెలిపారు. చెప్పులు గంగాధర్ చెప్పులు కుడుతూ జీవనం సాగించేవాడు. ఈ నెల16న దేవాడ, సిర్‌సముందర్ వెళ్తున్నాని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఘటన స్థలానికి విచారణ చేపట్టగా గంగాధర్ మృతదేహంగా పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య



యాదయ్య మృతదేహం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిర్మన్‌పల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. మర్కల్ గ్రామానికి చెందిన దమాల యాదయ్య(40) గొర్లకాపరిగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా తాగుడు బానిసకావడంతో జీవితంపై విరక్తితో గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరికి జైలు శిక్ష

బోధన్‌టౌన్(బోధన్): బర్దిపూర్ గ్రామానికి చెందిన మేకల జెల్లబోయికి నాలుగు నెలల క్రితం జరిగిన చోరీ కేసులో సాధారణ ఆరు నెలల జైలు శిక్ష, రూ. వంద జరిమానా విధిస్తూ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రుబీనా ఫాతిమా బుధవారం తీర్పు వెల్లడించారు. పీపీ సీహెచ్ రాణి తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలంలోని బర్దిపూర్ గ్రామానికి చెందిన మేకల జెల్లబోయి నాలుగు నెలల క్రితం చోరీకి పాల్పడ్డాడు. కోర్టులో సాక్షాధారాలు రుజువు కావడంతో న్యాయమూర్తి ఆరు నెలల జైలు శిక్ష, రూ. వంద జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు తెలిపారు.

స్కూల్‌బస్ డ్రైవర్‌కు..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని బైరాపూర్ తండాకు చెందిన అంబర్ సింగ్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు. నగరంలోని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న అంబర్‌సింగ్ మంచిప్ప నుంచి బాడ్సి, చిన్నాపూర్ మీదుగా బస్సును ప్రమాదకరంగా నడపడంతో విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వారు బస్సును నిలిపివేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంబర్‌సింగ్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పరీక్ష చేసి జడ్జి ముందు ప్రవేశపెట్టారు. పరీక్షలో మద్యం సేవించినట్లు రుజువు కావడంతో అంబర్‌సింగ్‌కు రెండురోజుల జైలు శిక్ష జడ్జి విధించినట్లు తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరంలోని శివాజీనగర్‌కు చెందిన ఆర్మూర్ లింగంపై దాడికి పాల్పడిన దేవేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రాము బుధవారం తెలిపారు. ఆర్మూర్ లింగం, శ్రీధర్, ప్రవీణ్ కల్లు సేవించేందుకు న్యాల్‌కల్ కల్లు డిపోకు వచ్చారు. అక్కడ దేవేందర్‌కు చెందిన బైక్ అడ్డుగా ఉండడంతో పక్కకు జరిపే విషయంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపంతో దేవేందర్ లింగంపై కల్లు సీసాతో దాడి చేశాడు. దాడిలో తల, చేతికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు దేవేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భిక్కనూరులో బంగారం చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఓ బంగారు దుకాణంలో బంగారం చోరీ జరిగిందని ఎస్సై సాయికుమార్ బుధవారం తెలిపారు. బంగారు దుకాణ నిర్వాహకుడు రమేశ్‌చౌదరి హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో దుకాణంలో ఉన్న గుమాస్తాలు ఓ దంపతులకు చేతి వేలి బంగారం కోసం చూయించగా వారు కొనలేదని చెప్పారు. వారు దుకాణం నుంచి వెళ్లిన సమయంలోనే బంగారం కనిపించకుండా పోయిందని నిర్వాహకుడు తెలిపాడు. దుకాణ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళా బిల్లు.. చారిత్రక మలుపు

- మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు శ్రీలక్ష్మి



మంచాల శ్రీలక్ష్మి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భూదేవంత సహనం ఉన్న మహిళలు ఆకాశంలో సగం అంటూ అభివర్ణించినప్పటికీ చట్టసభల్లో మాత్రం ఇప్పటి వరకు అతివలకు ఆశించినంత మేర అవకాశాలు దక్కలేదని మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు మంచాల శ్రీలక్ష్మి అన్నారు. అన్నిరంగాల్లో మహిళలు స్ఫూర్తిదాయకంగా, ఆదర్శనీయమైన విజయాలు సాధిస్తూ వస్తున్నారన్నారు. అంతర్జాతీయ కంపెనీలకు అధిపతులుగా, శాస్త్రవేత్తలుగా, అధికారిణులుగా, ఉద్యోగులుగా తిరుగులేని ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా, కుమార్తెగా అతివలు సమాజాన్ని నడిపించడంలో ముందున్నారని అన్నారు. ఇలాంటి నేపథ్యంలో చట్టసభల్లో 33శాతం అవకాశాలు కల్పించేలా భారత ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. 'నారీ శక్తి వందనం' పేరిట ఈ బిల్లును మోదీ ప్రభుత్వం తీసుకురావడం సమాజాభివృద్ధికి గొప్ప చారిత్రక మలుపని అభివర్ణించారు. ఏళ్లతరబడి పోరాటం చేసిన మహిళలకు తాజాగా ఈ గౌరవం దక్కడం అభినందనీయమన్నారు. కొత్త పార్లమెంట్ భవనంలో మొదటి బిల్లుగా దీన్ని ప్రవేశపెట్టడం గర్వకారణమని పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు



రోడ్డుపై కంకర పోసిన సిబ్బంది



సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌రూరల్: మాధవనగర్ ప్రాంతంలో జరుగుతున్న ఆర్వోబీ పనులకు అధికారులు ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ నెల 3వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురించిన 'చినుకు పడితే చిత్తడే' అనే కథనానికి ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించారు. ప్రత్యామ్నాయ రోడ్డుకు ఏర్పాటుకు ముందు బురదతో గుంతల మయంగా మారిన రోడ్డుతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు సాక్షి కథనానికి స్పందించి కంకరపోసి ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) 2వ, 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణతో కలిసి బుధవారం విడుదల చేశారు. జూన్‌లో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాల్లో బాలికలేపై చేయి సాధించినట్లు తెలిపారు. డిగ్రీ 2వ సెమిస్టర్ పరీక్షలకు 8,985 మంది విద్యార్థులు హాజరు కాగా 442 మంది బాలురు (11.96 శాతం) 1,904 మంది బాలికలు (36 శాతం) మొత్తం 2,346 మంది (26.11 శాతం) ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. 4వ సెమిస్టర్ పరీక్షలకు 9,939 మంది విద్యార్థులు హాజరు కాగా 720 మంది బాలురు (17.02 శాతం), 2,589 మంది బాలికలు (45.36 శాతం) మొత్తం 3,309 మంది (33.29 శాతం) ఉత్తీర్ణులైనట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఈ ఫలితాల్లో బాలికలు ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఫలితాలను వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు కృషి చేసిన కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ, అడిషనల్ కంట్రోలర్స్ నందిని, శాంతాబాయి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, పరీక్షల విభాగం సిబ్బందిని రిజిస్ట్రార్ అభినందించారు. కార్యక్రమంలో పీఆర్వో పున్నయ్య పాల్గొన్నారు.

గ్రామస్తులపై కేసులను ఎత్తివేయాలి



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: రెండేళ్ల క్రితం హాసకొత్తూర్‌లో గిరిజన యువకుడు మాలవత్ సిద్ధార్థ్ హత్య జరిగిన పరిణామలపై గ్రామస్తులపై అక్రమంగా బనాయించిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. హాసకొత్తూర్‌లోని గాంధీ విగ్రహం ఎదుట గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్షకు వీరు వేర్వేరుగా బుధవారం సంఘీభావం తెలిపారు. నిందితుడు అధికార పార్టీకి చెందిన వాడు కావడంతో ప్రభుత్వ అండదండలతో 18 మంది అమాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని ఆరోపించారు. కేసులను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రవి, కుందేటి శ్రీను, సంజీవ్, బట్టు వేణు, కస్తూరి శ్రీను, దేవేందర్ పాల్గొన్నారు.

జాతీయ థాయ్ బాక్సింగ్‌లో బంగారు పతకం



గంగోత్రిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని కంఠేశ్వర్ ఉమెన్స్ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గంగోత్రి జాతీయ థాయ్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ భారతిరెడ్డి బుధవారం తెలిపారు. డిసెంబర్ 26 నుంచి 29 వరకు నేపాల్‌లో నిర్వహించే సౌత్ ఏషియన్‌బాక్సింగ్ పోటీలకు ఎంపికైందన్నారు. అనంతరం కళాశాలలో విద్యార్థిని గంగోత్రిని కళాశాల మేనేజ్‌మెంట్ కోశాధికారి పురం అబ్బన్న, సహాయ కార్యదర్శి పద్మనాభరెడ్డి, సిబ్బంది సన్మానించారు.

హత్యాయత్నం చేసిన వారిని శిక్షించాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్తులు

మోర్తాడ్(బాల్కొండ): మండలంలోని రామన్నపేట్‌లో రాజారపు లింబాద్రిపై హత్యాయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈనెల 18న అదే గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు నలుగురు చంపుతామని బెదిరించారని, బుధవారం మళ్లీ బస్టాండ్ వద్ద దాడికి పాల్పడి చంపడానికి ప్రయత్నించారని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సరైన చర్య తీసుకోవడం లేదని ఆరోపిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఉన్నతాధికారులతో చర్చించి దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు, మోర్తాడ్ ఎస్సై అనిల్‌రెడ్డి హామీ ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకోను విరమించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి టోకరా

కామారెడ్డి క్రైం: లక్కీడ్రాలో విలువైన మొబైల్ ఫోన్ గెలుచుకున్నారని నమ్మించిన ఆన్‌లైన్ మోసగాళ్లు ఓ సాఫ్ట్‌వేర్ యువతికి రూ.50 వేలకు టోకరా వేసిన ఘటన జిల్లా కేంద్రంలోని శ్రీనివాసనగర్‌లో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఈనెల 16న గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి లక్కీడ్రాలో మొబైల్ గెలుచుకున్నారని నమ్మించారు. జీఎస్టీ కింద తిరిగి చెల్లించబడే రూ.50 వేలు జమ చేయాలని సూచించారు. వారు చెప్పినట్టుగానే చేసిన సదరు యువతి మోసపోయినట్లు గుర్తించింది. వెంటనే పోలీసులను ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

గంజాయి అమ్మితే పీడీ యాక్ట్

ఖలీల్‌వాడి: గంజాయి అమ్ముతూ పట్టుబడితే పీడీ యాక్ట్ అమలు చేస్తామని ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్ తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు ఆర్మూర్ పరిధిలోని అన్ని గామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కమ్మర్‌పల్లిలో ముగ్గురు, మెండోరాలో ఒకరు, ముప్కాల్‌లో ఇద్దరి నుంచి 300 గ్రాములు చొప్పున గంజాయి స్వాధీనం చేసుకొని వాటిని సీజ్‌చేసి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు, ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.